క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

కేపీహెచ్‌బీకాలనీ: కేపీహెచ్‌బీకాలనీ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా విద్యుత్ నిలిపివేయనున్నట్లు కేపీహెచ్‌బీ ఏఈ విద్యాసాగర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఎంఆర్‌ఓ కార్యాలయం, చాకలి దాభా ఎల్‌ఐజీ, మహారాష్ట్ర బ్యాంక్, ధనలక్ష్మి సెంటర్, మంజీరా మాల్ నుంచి జేఎన్‌టీయూ గేటు, రెమెడీ హాస్పిటల్, రెయిన్‌ట్రీ ఆసుపత్రి, బజాజ్ షోరూం, ఎస్‌ఎస్ నుంచి ఈ సేవా, వాటర్ ట్యాంక్స్, శ్యామ్ ముఖర్జీ పార్కు, చౌదరి మెస్, చారి డీటీఆర్, ఎంఐజీ 480, సౌజన్య డీటీఆర్, ఎంఐజీ 366, 295 సుబ్బయ్య హోటల్, మమత హాస్పటల్, మధుసూదన్ హాస్పటల్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ధర్మారెడ్డి పార్కు రౌండ్, ఐసీఐసీఐ బ్యాంక్, పూజా ఎలక్ట్రికల్ షాపు ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 11 నుంచి 3గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు



పార్టీలో చేరిన యువకులతో గొట్టిముక్కల వెంగళరావు

కూకట్‌పల్లి: బోయినపల్లి డివిజన్‌కు చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీలో చేశారు. సోమవారం కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గొట్టిముక్కల వెంగళరావు 100 మంది యువకులకు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారికి మంచి గుర్తింపు ఉంటుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మోయిజ్, జహంగీర్, బాలాజీ, నసీర్, ముజఫర్, ఫిరోజ్, భాస్కర్, మోసిన్, అస్లాం, ముస్కల్, ఇంతియాజ్, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

విదేశీ విద్యపై అవగాహన సదస్సు

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి వివేకానందనగర్‌లోని వారధి ఓవర్సీస్ ఎడ్యుకేషనల్ కన్సల్టెన్సీ వారి ఆధ్వర్యంలో సోమవారం విదేశీ విద్యపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రముఖ కెన్నెసా స్టేట్ యూనివర్సిటీ అసోసియేట్ డీన్ డా.లీలి, డాక్టర్ బెంజమెన్ క్లైన్ పాల్గొని విద్యార్థులకు వచ్చే ఉపకార వేతనాలు, అసిస్టెంట్ షిప్ అవకాశాల గురించి వివరించారు. విదేశీ విద్య అధిక ఖర్చుతో కూడుకున్నది కాదని ప్రతి పేదవాడికి వారధి ఓవర్సీస్ అవకాశాలను ఇస్తుందని వివరించారు. వీసా ఇంటర్వ్యూ సులభతరం చేసేందుకు ఈ బుక్‌ని ప్రతి విద్యార్థికి అందిస్తున్నామని నిర్వాహకులు ఐనోలు వెంకటేశ్వర్లు తెలిపారు. కార్యక్రమంలో వారధి మేనేజర్ కృష్ణపోట్ల విద్యార్థులు పాల్గొన్నారు.

పార్కులకు మహర్దశ

- ఆధునిక పార్కులకు అడ్డాగా హౌసింగ్‌బోర్డుకాలనీ
- కోట్లాది రూపాయలతో ఆధునిక హంగులు
- నగరంలోనే సరికొత్త థీమ్ పార్కులకు నిలయంగా మారుతున్న వైనం





కేపీహెచ్‌బీకాలనీ: కూకట్‌పల్లి హౌసింగ్‌బోర్డుకాలనీ ఆధునిక పార్కులకు అడ్డాగా మారింది. జీహెచ్‌ఎంసీ పరిధిలోనే ఆధునికతకు అద్దంపట్టేలా పార్కులను తీర్చిదిద్దటంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతంలో సెలవు రోజుల్లో పార్కులను చూసేందుకు నగరంలోని పేరొందిన పార్కులకు ఇక్కడి ప్రజలు వెళ్లేవారు. అయితే మారిన కాలంతో పాటు కూకట్‌పల్లి నియోజకవర్గంలోని పార్కులను, ఆటస్థలాలను అభివృద్ధి పరచడంపై స్థానిక ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు దృష్టి సారించడంతో కోట్లాది రూపాయల నిధులతో కేపీహెచ్‌బీకాలనీ పార్కులు ఆధునికతను సంతరించుకున్నాయి.

మహిళా పార్కుతో మొదలు....

తెలంగాణ రాష్ట్రంలోనే ఎక్కడా లేని విధంగా కేవలం మహిళల కోసం కేపీహెచ్‌బీకాలనీలోని విశాలమైన స్థలంలో మహిళా పార్కును ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు చొరవతో అప్పటి హౌసింగ్‌బోర్డు వీసీ చిత్రారామచంద్రన్ సహకారంతో మహిళా పార్కు కల సాకారమైంది. హౌసింగ్‌బోర్డు చరిత్రలోనే పార్కుల ఏర్పాటు కోసం ప్రత్యేకంగా నిధులను కేటాయించిన దాఖలాలు లేవు. అయినప్పటికీ కేపీహెచ్‌బీకాలనీలో మహిళా పార్కు ఏర్పాటుకు చిత్రారామచంద్రన్ నిధులను కేటాయించారు.

◆ అదేవిధంగా బాలాజీనగర్ డివిజన్ పరిధిలోని 15వ ఫేజ్‌లో జంగిల్‌బుక్ పార్కు, 5వ ఫేజ్‌లో పీకాక్ పార్కు, ఫేజ్1, 2లలో నిర్మిస్తున్న ఆధునిక పార్కులు ప్రజల ఆదరణను పొందుతున్నాయి. కొత్తపార్కులతో పాటు కేపీహెచ్‌బీ4. 6,7.9వ ఫేజ్‌లలో అప్పటికే ఉన్న పార్కులను మరింత ఆధునిక హంగులతో తీర్చిదిద్ది ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారు.

ఆధునిక థీమ్ పార్కులు...

సరికొత్త ఆలోచనలతో సకల జనులు సద్వినియోగం చేసుకునేలా కేపీహెచ్‌బీకాలనీలో మరో రెండు కొత్త థీమ్ పార్కులను జీహెచ్‌ఎంసీ అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. 4వ ఫేజ్‌లో నిర్మిస్తున్న జిమ్ థీమ్ పార్కు అందరిని ఆకట్టుకునేలా రూపుదిద్దుకుంటోంది. ఆరోగ్య సంరక్షణ కోసం వ్యాయామం, యోగా వంటి వాటికి ప్రాధాన్యమిస్తూ రూ.1.5 కోట్లతో థీమ్ పార్కును నిర్మిస్తున్నారు. ఇందులో ప్రత్యేకంగా దివ్యాంగులు వ్యాయామం చేసుకునేలా ప్రత్యేకంగా జిమ్ పరికరాలను ఏర్పాటు చేస్తున్నారు. వర్టికల్ పరేడ్‌తో పాటు పురుషులు, మహిళలకు వేర్వేరుగా ఓపెన్ జిమ్‌లు, యోగా డెస్క్, డ్యాన్సింగ్ డెస్క్, చిల్డ్రన్ ప్లే ఏరియా, మల్టీపర్పస్ రన్నింగ్ ట్రాక్, స్వింగ్‌సీటింగ్, చిన్నారుల కోసం వాల్ క్లైంబింగ్ వంటివి ఏర్పాటు చేస్తున్నారు.

సోలార్ థీమ్ పార్కు...

సోలార్ విద్యుత్‌ను వినియోగించుకుంటూ ఆధునిక సాంకేతికతను సద్వినియోగం చేసుకునేలా కేపీహెచ్‌బీకాలనీ 7వ ఫేజ్‌లో థీమ్ పార్కు రూపుదిద్దుకుంటోంది. ఇందులో ఇన్‌ఫర్మేటివ్ ఎల్‌ఈడీ బోర్డులు, వాటర్ ఫౌంటేయిన్, ఫ్యాత్‌వే లైటింగ్, మ్యూజికల్ ఇన్‌స్ట్రుమెంట్స్, మల్టీకలర్ పెర్గోలా అండ్ ఫోటో వోల్టిక్ సిస్టం, స్మార్ట్ బెంచీలు, సోలార్ ట్రీ, మెటాలిక్ విండ్ మిల్స్, ఎడ్యుకేట్ ప్రిటింగ్ ఆన్‌వాల్, చిల్డ్రన్ ప్లే ఏరియా తదితర సదుపాయాలను కల్పిస్తున్నారు. పార్కులను ఆధునీకరించడంతో పాటు వాటిని ప్రజలు సద్వినియోగం చేసుకునేలా జీహెచ్‌ఎంసీ అధికారులు చేపడుతున్న పనులు ప్రజల మన్ననలను అందుకుంటున్నాయి.

ప్రజావాణిలో 83 ఫిర్యాదులు

సాక్షి,మేడ్చల్ జిల్లా: ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులు, దరఖాస్తులను పరిశీలించి ఎప్పటికప్పుడు పరిష్కరించేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా రెవెన్యూ అధికారి లింగ్యానాయక్ అన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో జిల్లా నలుమూలల నుంచి వివిధ సమస్యలతో తరలివచ్చిన ప్రజల నుంచి 83 విజ్ఞప్తులను ఆయన స్వీకరించారు.

మార్చి 4 నుంచి మల్లికార్జునస్వామి జాతర

సుభాష్‌నగర్: గాజులరామారం డివిజన్ మెట్‌కానిగూడలోని శ్రీ మల్లికార్జునస్వామి జాతర ఘనంగా నిర్వహించనున్నామని ఆలయ కమిటీ ఓ ప్రకటనలో తెలిపింది. మార్చి 4వ తేదీ నుంచి నాలుగు రోజుల పాటు స్వామివారి జాతర కొనసాగనుందని పేర్కొంది.7వ తేదీన సాయంత్రం 5గంటలకు కొండపోచమ్మ, చిత్తారమ్మ, మైసమ్మలకు బోనాలు ఉంటాయని తెలిపింది.

వ్యర్థాలను చెత్త తరలింపు వాహనంలోనే వేయాలి



బాలానగర్: స్వచ్ఛ భారత్ అవగాహన ర్యాలీని సోమవారం ఫతేనగర్‌లో నిర్వహించారు. ఈ ర్యాలీలో కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్ పాల్గొని మాట్లాడారు. శోభన మార్కెట్‌యార్డులోని వ్యర్థాలను, ఇంట్లోని చెత్తాచెదారాన్ని చెత్త తరలింపు వాహనంలోనే వేయాలన్నారు. రోడ్లపై చెత్త వేసే వారిపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సెయింట్ జోసెఫ్ పాఠశాల విద్యార్థులు, ఫతేనగర్ డివిజన్ ఇన్‌చార్జ్ హరికృష్ణ రెడ్డి, శానిటైజేషన్ జవాన్ పోచయ్య, రవి, సతీష్, మమత, శాంతి, సురేందర్ నాయుడు పాల్గొన్నారు.

అభినందనలు

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ డివిజన్ పోచమ్మ బస్తీ అసోసియేషన్ ఎన్నికల్లో ముకయ్య విజయం సాధించారు. ఈ సందర్భంగా శేరిలింగంపల్లి నియోజకవర్గ బీజేపీ నాయకుడు ఉప్పల ఏకాంత్‌గౌడ్ సోమవారం ఆయనను శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోచమ్మ బస్తీ సమస్యలపై, అభివృద్ధికి సంబంధించిన విషయాలలో బస్తీవాసులను కలుపుకొని ముందుకె వెళ్లాలని సూచించారు.

డాక్టర్ ప్రీతినాయక్‌కు నివాళి



జేఎన్‌టీయూహెచ్‌లో జేఏసీ ఆధ్వర్యంలో ప్రీతినాయక్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

కేపీహెచ్‌బీకాలనీ: జేఎన్‌టీయూహెచ్ ప్రాంగణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సోమవారం డా. ప్రీతినాయక్ ఆత్మకు శాంతి చేకూరాలని జేఏసీ నాయకులు రెండు నిమిషాల మౌనం పాటించారు. ఈ సందర్భంగా డా. ప్రీతి నాయక్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జేఏసీ నాయకులు మాట్లాడుతూ... ప్రీతి కుటుంబానికి ప్రభుత్వ ఉద్యోగంతో పాటు రూ.50లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలన్నారు. ఆమె మరణానికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. దేశంలో యూనివర్సిటీల విద్యార్థులపై ర్యాగింగ్ పేరుతో సీనియర్లు వేధింపులకు పాల్పడటం బాధాకరమన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా యూనివర్సిటీ అధికారులు కఠినంగా వ్యవహరించాలని కోరారు. జేఎన్‌టీయూహెచ్ జేఏసీ చైర్మన్ బొట్ల భిక్షపతి, అధ్యక్షుడు మంద రంజిత్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ బల్గర్ సందీప్, ప్రణయ్ యామిని, శ్రీశిక, యామిన, అఖిల్, విద్యార్థు పాల్గొన్నారు.

కల్యాణ మహోత్సవం



ఆలయ వార్షికోత్సవంలో ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ డివిజన్ పరిధిలోని సప్తగిరి కాలనీలో శ్రీ మల్లికార్జునస్వామి భ్రమరాంబిక కల్యాణం, గొల్ల కేతమ్మ ఆలయం 18వ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, వివేకానందనగర్ డివిజన్ నాయకులు సంజీవరెడ్డి, మాదాపూర్ డివిజన్ అధ్యక్షుడు ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు కాశీనాథ్‌యాదవ్, ఎండీ ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

డీఆర్‌ఓ లింగ్యానాయక్

సాక్షి,మేడ్చల్ జిల్లా: ఇంటర్మీడియట్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేలా చర్యలు తీసుకోవడంతో పాటు విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పరీక్ష కేంద్రాల్లో అవసరమైన వసతులు కల్పించాలని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా రెవెన్యూ అధికారి లింగ్యానాయక్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మార్చి15 నుంచి ప్రారంభం కానున్న ఇంటర్మీడియట్ పరీక్షలకు సంబంధించి జిల్లా ఇంటర్మీడియట్ అధికారి కిషన్, జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారితో కలిసి సంబంధిత శాఖల అధికారులతో ముందస్తు ఏర్పాట్లపై ఆయన సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఇంటర్మీడియట్ పరీక్షలు మార్చి15 నుంచి ఏప్రిల్ 4 వరకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటలకు జరుగుతాయని, పరీక్షల నిర్వహణలో అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించాలని డీఆర్‌ఓ ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా 133 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా విద్యుత్తు సరఫరా, లైటింగ్, ఫ్యాన్లు, తాగునీటి వసతులన్నీ ఉండేలా ముందస్తు ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఇంటర్ పరీక్షలకు సంబంధించి ప్రథమ సంవత్సరంలో జనరల్ విద్యార్థులు 62,342 మంది, ఒకేషనల్ కోర్సులో 1,452 మంది మొత్తంగా 63,794 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారన్నారు. ద్వితీయ సంవత్సరానికి సంబంధించి జనరల్లో 54,146 మంది, ఒకేషన్ కోర్సులో 995విద్యార్థులతో సహా మొత్తంగా 55,141మంది విద్యార్థులు పరీక్షలు రాస్తారన్నారు. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాలకు సంబంధించి జిల్లా వ్యాప్తంగా జనరల్లో 1,16,488 మంది, ఒకేషనల్ కోర్సులో 2,447 మంది విద్యార్థులతో సహా మొత్తంగా 1,18,935 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని పేర్కొన్నారు. పరీక్షల కేంద్రాల వద్ద మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని సూచించారు.

ఉపాధి హామీ పథకం పట్టణాల్లో అమలు చేయాలి



ఉపాధి హామీకి బడ్జెట్ పెంచాలని డిమాండ్ చేస్తున్న సీపీఎం నాయకులు

బాలానగర్: బాలానగర్ మండలంలోని దిల్‌కుష్‌నగర్‌లో కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ కేటాయింపులో ఉపాధి హామీ పథకానికి బడ్జెట్ తక్కువ కేటాయించారని సీపీఎం పార్టీ మండల నాయకురాలు విజయ అన్నారు. సోమవారం ఆమె మాట్లాడుతూ.. పేదలపై మోదీ ప్రభుత్వం వివక్ష చూపుతోందన్నారు. పేదల నుంచి దోచి కార్పొరేట్ సంస్థలను మేపుతున్నారని విమర్శించారు. ఉపాధిహామీలో పని చేస్తున్న వారి కూలీ ధరలు పెంచాలని డిమాండ్ చేశారు. అదే విధంగా ఆహారం, మందులపై జీఎస్టీని రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సబిరా, ఫాతిమా, నాజ్, నాగమ్మ, హానిసా తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం

కూకట్‌పల్లి: కూకట్‌పల్లిలోని మల్లికార్జున, భ్రమరాంబిక, గొల్ల కేతమ్మ అమ్మవార్ల ఆలయ వార్షికోత్సవాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. కూకట్‌పల్లి బీఆర్‌ఎస్ నాయకుడు గొట్టిముక్కల వెంకటేశ్వరరావు పాల్గొని పూజలు చేశారు. దేశ, రాష్ట్ర ప్రజలందరూ స్వామివారి ఆశీస్సులతో సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకున్నట్లు ఆయన తెలిపారు.

హాత్ సే హాత్ జోడో యాత్ర



ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్‌లో సోమవారం జరిగిన హాత్ సే హాత్ జోడో యాత్రలో టీపీసీసీ జనరల్ సెక్రటరీ జైపాల్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో యువజన అధ్యక్షుడు మారెళ్ల శ్రీనివాసరావు, రాజా, మణెమ్మ, సన్యాసిరావు, నారాయణ, సుజాత, వసంత, కరుణాకర్ రెడ్డి, గోపి పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



దుకాణ యాజమానికి డబ్బులు అందజేస్తున్న కార్పొరేటర్

ఓల్డ్ బోయిన్‌పల్లి: ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌లో నాలుగు రోజుల క్రితం అగ్నిప్రమాదంలో దగ్ధమైన కిరణాషాపు యాజమాని రమేష్‌కు సోమవారం కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ రూ.50 వేల ఆర్థిక సాయం అందజేశారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ... అగ్ని ప్రమాదంలో సుమారు రూ.9లక్షల వరకు నష్టపోయిన రమేష్‌కు మర్వాడీలు వ్యక్తిగతంగా ఒక్కొక్కరు రూ.5వేలను ఇచ్చి ఆదుకోవాలని కోరారు. దీంతో వారు సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బుర్రి యాదగిరి మర్వాడీ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

అక్రమ వాటర్ ప్లాంట్‌లు తొలగించాలి

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి డివిజన్ పాపిరెడ్డినగర్‌లో అక్రమంగా కొనసాగుతున్న వాటర్ ప్లాంట్‌లను తొలగించాలంటూ బస్తీ అధ్యక్షుడు ఊట్ల చంద్రారెడ్డి సమక్షంలో బస్తీవాసులు సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. స్వచ్ఛందంగా నడిపిస్తున్న వాటర్ ప్లాంట్‌లను మినహాయించి పెద్ద మొత్తంలో నీటిని విక్రయిస్తూ రానున్న తరాలకు జలవనరుల కొరతకు కారణమయ్యే వాటర్ ప్లాంట్‌లను వెంటనే తొలగించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బస్తీ ప్రధాన కార్యదర్శి భగవంత్ రెడ్డి, నాయకులు గడ్డం రాజేశ్వర్‌రెడ్డి, దొడ్ల రాంరెడ్డి, కనకారెడ్డి, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

పేకాడుతున్న 10 మంది అరెస్టు

కేపీహెచ్‌బీకాలనీ: హోటల్ గదిలో పేకాడుతున్న 10మందిని కేపీహెచ్‌బీ పోలీసులు అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.44,800 నగదు, 10 సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ కిషన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. సాయినగర్‌లోని నవ్య గ్రాండ్ హోటల్ గదిలో 10మంది పేకాడుతున్నట్లుగా పోలీసులకు సమాచారం అందింది. సోమవారం ఆకస్మిక దాడి నిర్వహించి వారిని అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు.

మార్చి 1 నుంచి సమ్మె

బాలానగర్: బాలానగర్‌లోని సీఐటీయూ కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో బాలానగర్ కార్యదర్శి ఐలాపురం రాజశేఖర్ పాల్గొని అంగన్‌వాడీ సమస్యల పరిష్కారం కోసం మార్చి 1 నుంచి 3వ తేదీ వరకు సమ్మె నిర్వహించాలని నిర్ణయించినట్లు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో సుమారు 70 వేల మంది అంగన్‌వాడీ ఉద్యోగులు పని చేస్తున్నారని అన్నారు. ఐసీడీఎస్‌లో పనిచేస్తూ పేదలకు సేవలు అందిస్తున్న వారికి నేటికీ పెన్షన్, ఈఎస్‌ఐ, ఉద్యోగ భద్రత, చట్టబద్ధ సౌకర్యాలు ఏమీ కల్పించలేదన్నారు. దీంతో అంగన్‌వాడీ ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. అదే విధంగా అంగన్‌వాడీ టీచర్లకు ఆసరా, కల్యాణలక్ష్మి వంటి ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమలు చేయాలన్నారు. అంగన్‌వాడీ ఉద్యోగులందరూ ఈ సమ్మెలో పాల్గొని జయప్రదం చేయాలని రాజశేఖర్ పిలుపునిచ్చారు.

దళితుల ఐక్యవేదిక సెంట్రల్ కమిటీ సర్వసభ్య సమావేశం

ఏడు తీర్మానాలకు ఆమోదం



హౌసింగ్‌బోర్డు కాలనీలో జరిగిన సమావేశంలో పాల్గొన్న సభ్యులు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి సర్కిల్ దళితుల ఐక్యవేదిక సెంట్రల్ కమిటీ ఆధ్వర్యంలో హౌసింగ్ బోర్డు కాలనీ కమ్యూనిటీహాలులో సోమవారం సెంట్రల్ కమిటీ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో 75 మంది దళిత ఐక్యవేదిక కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 7 తీర్మానాలకు ఆమోదం తెలిపారు. కేంద్ర కమిటీ ఆదేశాలను బేఖాతరు చేస్తూ మళ్లీ కొత్త కమిటీని ఎన్నుకున్నారని సభ్యులను తప్పుదోవ పట్టించిన తలారి రామును దళితుల ఐక్య వేదిక నుంచి రెండేళ్లపాటు సస్పెండ్ చేశారు. ప్రస్తుత కమిటీని రద్దు చేయకుండా 6 నెలల పాటు పొడిగించామన్నారు. సెంట్రల్ కమిటీ ట్రెజరర్‌గా బాధ్యతలు నిర్వర్తించిన తలారి రాము స్థానంలో ఎడ్ల ప్రభాకర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నామని తెలిపారు. ఏప్రిల్‌లో డా.బాబు జగజ్జీవన్‌రామ్, అంబేడ్కర్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని తీర్మానించినట్లు సెంట్రల్ కమిటీ అధ్యక్షుడు బోడ నర్సింగ్‌రావు, జనరల్ సెక్రటరీ ఎడ్ల సత్యనారాయణ పేర్కొన్నారు.

సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకే స్ట్రీట్ కార్నర్



మోతీనగర్: మోతీనగర్ క్రాస్ రోడ్డులో సోమవారం శక్తికేంద్ర ఇన్‌చార్జ్ అంజిరెడ్డి ఆధ్వర్యంలో స్ట్రీట్ కార్నర్ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మూసాపేట కార్పొరేటర్ మహేందర్ హాజరై మాట్లాడారు. అవినీతి కుటుంబ బీఆర్‌ఎస్ పార్టీని బొంద పెట్టాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. కేసీఆర్‌ను రాష్ట్ర ప్రజలకు ఏ హామీలు ఇచ్చి గద్దెను ఎక్కారో వాటిని మరిచి కేవలం ఫాంహౌస్‌లోనే కాలం గడుపుతున్నారని విమర్శించారు. ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు స్ట్రీట్ కార్నర్ సమావేశాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

◆ ఊసరవెల్లిలా రంగులు మార్చే బీఆర్‌ఎస్‌ను ఓడించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక ఉచిత విద్య, వైద్యం అందిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సూర్యరావు, వెంకటస్వామి, సద్గునరెడ్డి, డివిజన్ అధ్యక్షుడు మనోహర్, నాగరాజు, నర్సింహ, బూత్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



హనుమాన్‌నగర్‌లో జరిగిన స్ట్రీట్ కార్నర్‌లో పాల్గొన్న రవికుమార్ యాదవ్, స్థానికులు

హనుమాన్‌నగర్‌లో..

ఆల్విన్‌కాలనీ: ప్రజా గోస – బీజేపీ భరోసా స్ట్రీట్‌కార్నర్ సమావేశం సోమవారం హనుమాన్‌నగర్‌లో జరిగింది. శక్తి కేంద్రం ఇన్‌చార్జ్ పంతంగి బాలుయాదవ్, శ్రీకాంత్‌యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర నాయకుడు రవికుమార్ యాదవ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ప్రధాని మోదీ ప్రవేశపెట్టి అమలు చేస్తున్న పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు భూపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి, శ్రీధ పటేల్, సాయికుమార్, నరేష్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

నేటి స్ట్రీట్ కార్నర్ సమావేశానికి విజయశాంతి

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ పరిధిలోని వివేకానందనగర్‌లో మంగళవారం జరిగే స్ట్రీట్ కార్నర్ సమావేశానికి బీజేపీ సీనియర్ నాయకురాలు విజయశాంతి విచ్చేయనున్నారని అర్బన్ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. ఈ కార్యక్రమానికి బీజేపీ డివిజన్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు ప్రతి ఒక్కరూ పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.